క్లుప్తంగా

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



పాన్‌గల్: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీలు తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం మండలంలోని వెంగళాయిపల్లిలో ఇంటింటికీ తిరుగుతూ బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్కార్ బడుల్లో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత దుస్తులు, పుస్తకాలు, నోటుపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య వంటి అంశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో బడిబయట ఉన్న హేమంతు అనే విద్యార్థిని గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి 5వ తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్, సంతోష్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఆత్మకూర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముందుంటారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, గోపన్‌పేట సర్పంచ్ అంజనేయులుయాదవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన కుర్వ తంగెడి భారతికి వైద్య ఖర్చుల కోసం ఆమె తండ్రి పెద్దమల్లేష్‌కు రూ.90 వేల ఎల్‌ఓసీ కాపీని అందించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు జ్యోతి, మల్లేష్ నాయకులు ఉన్నారు.

నేటి నుంచి పీర్ల పండుగ



అమరచింత: మొహర్రం నెల ప్రారంభం కావడంతో బుధవారం ఆలం లను భద్రపర్చిన పీర్ల పెట్టెలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చావిడీలలో ఉంచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతో పాటు పట్టణ ప్రముఖులు పెద్ద పీర్ల మసీద్‌లో ఆలం పెట్టెలను కిందకు దించి నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని పాతేహ కార్యక్రమం నిర్వహించారు. గురువారం నుంచి మసీదులో ఆలంలు కొలువు తీరుతాయని ముజావర్లు జిలానీ, మైనోద్దీన్ తెలిపారు. మొహర్రం పదిరోజుల పాటు కులమతాలకు అతీతంగా పల్లెలు, పట్టణాల్లో సంబురాలు హోరెత్తుతాయి.

నులిపురుగులను నిర్మూలిద్దాం



వీపనగండ్ల: ఉమ్మడి వీపనగండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం చేపట్టనున్న నులిపురుగుల నివారణ కార్యక్రమంలో వైద్య సిబ్బంది చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంపై ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలకు తగు సూచనలు ఇచ్చారు. ఏడాది నుంచి 19 ఏళ్ల పిల్లలకు మాత్రలను అందించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

రైతువేదికల్లో రాజకీయాలు సరికాదు

వనపర్తి టౌన్: అధికారంలో ఉండి రైతుల సమస్యలు పట్టించుకోకుండా, రాజకీయ లబ్ధి కోసం రైతులను రెచ్చగొడుతూ రైతువేదికల్లో రాజకీయాలు చేయడం సరికాదని కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ చేయకుండా వారి జీవితాలతో ఆడుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. హోల్డ్‌లో పెట్టిన రైతుబంధు, ధాన్యం డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటనారాయణ, చీర్ల జనార్దన్‌సాగర్, పాండురంగారావు, జాన్ తదితరులు పాల్గొన్నారు.



సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

- అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే సూచన
- దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి
- గట్టు రిజర్వాయర్‌తో రైతులకు మేలు
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో దళారుల పాత్ర ఉండొద్దని, లబ్ధిదారులు నేరుగా అధికారులను కలవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్ దశలవారీగా నిధులు మంజూరు చేస్తూ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

బీసీ ప్లాట్ల కేటాయింపు

కేతేపల్లి, మల్లాయిపల్లి, మాందాపూర్, చిక్కేపల్లి తదితర గ్రామాల్లో బీసీ ప్లాట్లలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారని, త్వరలోనే లబ్ధిదారులకు పొజిషన్ ధ్రువపత్రాలు ఇస్తామని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. మూడు గంటల కరెంటు చాలు అన్న కాంగ్రెస్ కావాలా.. 24 గంటల విద్యుత్‌తో మూడు పంటల ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వర్షాకాలం సీజన్ కావున శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లు తొలగింపు, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

సాగునీటి సమస్యకు చెక్

మండలంలోని కిష్టాపూర్ సమీపంలో నిర్మించే రామన్నగట్టు రిజర్వాయర్‌తో అన్ని గ్రామాల రైతులకు సాగునీటి సమస్య తీరుతుంది. త్వరలోనే రిజర్వాయర్ నిర్మాణం పనులకు భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. 75 మంది శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు, 100 పడకల ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రం, మామిడి ప్రాసెసింగ్ సెంటర్, రోడ్ల విస్తరణ, సాగునీటి కోసం మినీ లిఫ్టులు మంజూరు చేయించామన్నారు. వచ్చే నెలల్లో గృహలక్ష్మి, నూతన పింఛన్లు, రెండోవ విడత దళిత బంధు, బీసీలకు రూ.లక్ష చేయూత వంటి పథకాలు అమలు చేస్తామని తెలిపారు.

యాదవుల అభ్యున్నతికి..

యాదవులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం సబ్సిడీపై గొర్రెలు పంపిణీ చేస్తుందన్నారు. మండలంలో యాదవులకు మంజూరైన గొర్రెల యూనిట్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా యాదవులు ఎమ్మెల్యేను గొంగడితో సత్కరించి గొర్రె పిల్లను బహూకరించారు. సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్, రవికుమార్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మునీరోద్దీన్, గొర్రెల కాపారుల సంఘం జిల్లా డైరెక్టర్ తిరుమల్‌యాదవ్, తిరుపతయ్యసాగర్, వైస్ ఎంపీపీ కవిత, ఏడీఏ చంద్రశేఖర్, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల్లో అర్హులైన వారిని గుర్తించి వారికి గృహలక్ష్మి ఇళ్ల, దళితబంధు, బీసీ చేయూత వంటి పథకాలు అమలు అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు.

ఇంటి స్థలం కేటాయించాలని వినతి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మండల జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోతే నియోజకవర్గ కేంద్రంలో కేటాయిస్తామన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



ఫీల్డ్ ఆఫీసర్లను సన్మానిస్తున్న ఎంపీపీ, మహిళా సంఘాల సభ్యులు

ఆత్మకూర్: బ్యాంక్‌ల ద్వారా రుణాలు పొందుతున్న గ్రామ ఐక్య మహిళా సంఘాల సభ్యులు తిరిగి చెల్లించడంలో ముందున్నారని ఐకేపీ డీపీఎం అరుణ, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల సభ్యులకు రూ.2.61 లక్షల స్త్రీనిధి చెక్కులను అందజేశారు. మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించి పురుషులకు దీటుగా వ్యాపార రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కొంతమంది రుణాలు చెల్లించకపోవడంతో ఇతరులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందరూ సకాలంలో రుణాలు చెల్లించినప్పుడే గ్రామంలో ఉన్న అన్ని మహిళా సంఘాలకు మనుగడ ఉంటుందన్నారు. అలాగే ఇక్కడ సుదీర్ఘకాలం పాటు ఏపీఎంగా సేవలు అందించి అమరచింతకు బదిలీపై వెళ్లిన శ్రీనివాస్‌ను, మహిళలకు సకాలంలో రుణాలు అందిస్తు ఆర్థిక భరోసా కల్పిస్తున్న బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లను శాలువాలతో సత్కరించారు.

చెట్లతోనే జీవ మనుగడ సాధ్యం



అన్నారంతండాలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, సర్పంచ్

ఆత్మకూర్: జీవి మనుగడకు స్వచ్ఛమైన ఆక్సీజన్ ఎంతో అవసరమని, ఇది కేవలం వృక్షాల ద్వారానే లభిస్తుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ నర్సింగ్‌రావు అన్నారు. బుధవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి మొక్కలను నాటారు. నాటిన ప్రతి మొక్క వృక్షంగా ఎదిగేంత వరకు కాపాడాలని సూచించారు.

పాన్‌గల్: హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాటుతున్న మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అన్నారంతండాలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలను నాటాలని కోరారు. విద్యాసంస్థలు, ఇంటి ఆవరణల్లో మొక్కలు నాటేలా చూడాలన్నారు. దీంతో పాటు వర్షాకాలం సీజన్ కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగానాయక్, పంచాయతీ కార్యదర్శి బొజ్యానాయక్, అంగన్‌వాడీ టీచర్ నిర్మల పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌పై ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న హనుమాన్‌రావు

మదనాపురం: ప్రభుత్వం రైతులకు ఇస్తున్న 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు సరఫరా ఇలాగే కొనసాగించాలని బుధవారం రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశం మేరకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచనతో అజ్జకొల్లు రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. రైతుబంధు మండల అధ్యక్షుడు హనుమాన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్, సర్పంచ్ బ్రహ్మమ్మ, నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు అనంత జయంతి, వెంకటనారాయణ, మండల అధ్యక్షుడు యాదగిరి, రాములు, ఎంపీటీసీ కురుమయ్య, సర్పంచ్ కురుమూర్తి, మహాదేవన్‌గౌడ్, టీసీ నాగన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' కార్మికుల హక్కుల సాధనకు పోరాటం



వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అమరచింత: రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా ఆందోళనలు నిర్వహించడంలో ముందుంటామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం తెలిపారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ హైదరాబాద్‌లో చాడ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికులకు జీఓ నంబర్ 11 ప్రకారం నెలకు రూ.16,496 వేతనం చెల్లించాలన్నారు. ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ, బోనస్‌లను అమలు చేయాలని కోరారు. వారాంతపు సెలవు, జాతీయ, పండగల సెలవులుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింహ, రఘు తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల కనీస వేతనం అందించాలి: బీఎస్పీ



మాట్లాడుతున్న చెన్నరాములు

పెబ్బేరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో దశాబ్దాల తరబడి పనిచేస్తున్న స్వీపర్లను క్రమబద్ధీకరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగమోని చెన్నరాములు కోరారు. జిల్లా కేంద్రంలో స్వీపర్లు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షలకు బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రూ.1,600తో అరకొర జీతాలు, ఆర్థిక ఇబ్బందులతో నిత్యం పనులు చేస్తున్నారని వాపోయారు. బడిని శుభ్రం చేయడంతో పాటు వారితో ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం తీరును తప్పుబట్టారు. ప్రచార ఆర్భాటాలకు రూ.వందల కోట్లు ఖర్చు చేసే ప్రభుత్వం స్వీపర్లకు కనీస వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు.

రోడ్డు ఇలా.. నడిచేదెలా?



కొత్తకోట: పట్టణం మేజర్ గ్రామ పంచాయతీ నుంచి దినదినాభివృద్ధి చెందుతూ ఐదేళ్ల క్రితం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. కానీ గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి సమస్యలే నేటికీ దర్శనమిస్తున్నాయి. పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా కాలనీల్లోని అంతర్గత రోడ్లు మట్టి రోడ్లుగానే కనిపిస్తున్నాయి. చినుకు పడితే చిత్తడే అన్న చందంగా.. రోడ్లన్నీ బురమయంగా మారాయి. సైడ్ డ్రెయినేజీలు సరిగ్గా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో రోడ్లు చిన్నపాటి కొలనులుగా మారుతున్నాయి. 10వ వార్డులోని గ్రంథాలయం వీధి రెండేళ్లుగా సీసీ రోడ్డుకు నోచుకోకపోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారి నడవడానికి వీల్లేకుండా తయారయింది. స్థానిక కౌన్సిలర్‌కు, మున్సిపల్ చైర్‌పర్సన్‌కు, కమిషనర్ దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పకైనా ప్రజాప్రతినిధులు పాలనపై దృష్టి సారించి పట్టణంలోని అంతర్గత రోడ్లను సీసీ రోడ్డుగా మార్చాలని పట్టణవాసులు కోరుతున్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం

పెబ్బేరు: మండలంలో కంచిరావుపల్లికి చెందిన టార్గెట్‌బాల్ క్రీడాకారుడు ఉమాశంకర్‌కు వనపర్తి నియోజకవర్గ నాయకుడు మేఘారెడ్డి బుధవారం రూ. 20 వేలు ఆర్థికసాయం చేశారు. పేద కుటుంబానికి చెందిన ఉమాశంకర్ గతంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ క్రీడల్లో ప్రతిభ కనబర్చడంతో పాటు ఈ నెల 21న బంగ్లాదేశ్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మేఘారెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ టార్గెట్ బాల్ క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఉమాశంకర్‌కు సూచించారు.

రైతుబీమాకు దరఖాస్తుల ఆహ్వానం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలో కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ చంద్రమౌళి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోని రైతులు మీ క్లస్టర్ గ్రామాల్లో రైతు వేదికల వద్ద రైతుబీమా దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పట్టదారు పాస్‌బుక్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లు ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు..

ఆత్మకూర్: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనర్ ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు తెలుగు, కంప్యూటర్ సైన్స్, జంతుశాస్త్రం, గణితశాస్త్రం, వాణిజ్యశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21 సాయంత్రం 3:30 గంటల లోపు కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, 22వ తేదీన వనపర్తిలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూలకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 94405 5677, 96762 23424 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, చరిత్ర సబ్జెక్టులను బోధించుటకు అతిథి అధ్యాపకుల నియమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 21వ తేదీన సాయంత్రం లోగా దరఖాస్తులను ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్‌కు అందజేయాలని, వివరాల కోసం సెల్: 98495 75428 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

బీఎల్వోలకు శిక్షణ

వనపర్తి: జిల్లా కేంద్రంలోని బీఎల్‌ఓలకు గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఓటరు జాబితా నమోదు వివరాల సేకరణపై ఒక్కరోజు శిక్షణ తరగతుల నిర్వహిస్తున్న బుధవారం తహసీల్దార్ రాజేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు అన్వేష్, రమేష్ అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చింతకుంటలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జగన్ గుప్తా, మధుసూదన్‌యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పట్టణ సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాపంథా పార్టీ నాయకులు

అమరచింత: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాకు వినతి పత్రం అందించారు. ఈమేరకు ప్రజాపంథా పార్టీ నాయకులు మాట్లాడుతూ 3, 4, 5 వార్డుల్లో ఉన్న చెరువు కాల్వ మరమ్మతును వెంటనే చేపట్టాలని కోరారు. కాల్వలో మురుగునీరు ముందుకు వెళ్లకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణానికి వనపర్తి, నారాయణపేట, షాద్‌నగర్ డిపోల ద్వారా ఆర్టీసీ బస్సు సర్వీస్‌లను నడపాలని కోరారు. తొమ్మిదో వార్డులో సైకిల్ కృష్ణయ్య ఇంటి నుంచి మెయిన్ రోడ్డు వరకు నూతనంగా డ్రెయినేజీ నిర్మించాలన్నారు. జెడ్పీ హైస్కూల్ ఆవరణంలో వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు విన్నవించారు. పట్టణంలో ఇంటర్, డిగ్రీ కాలేజీల ఏర్పాటుకు పాలక మండలి కృషి చేయాలని కోరారు. దళితబంధు మాదిరిగా కులవృత్తి రుణాలను నిరుపేదలందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజన్న, సామేలు, పేమరత్నం, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



మదనాపురంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

మదనాపురం: ఎనిమిది గంటల పని దినం అమలు, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నాగేంద్రం కు అందజేశారు. కార్యక్రమంలో రాజు, ఖాదర్, మధు, ప్రదీప్, నాగన్న, రమేష్, కురుమన్న పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: గ్రామ పంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న సమ్మెకు కాంగ్రెస్, బీఎస్పీ ఆధ్వర్యంలో మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు రూ.19 వేల వేతనం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం మాని తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వేముల శ్రీధర్,ధాశన్న, మూసా, శివనారాయణ, రవి, బహుజన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెబ్బేరు: రోజురోజుకూ పెరుగుతున్న ముసురు వానలకు ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణం మార్పులతో ముసురు వానలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందని, రైతులు పొలాల్లో వ్యవసాయ బోర్లు, బావులు విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలకు వద్దకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. మిట్టి మిద్దెలు ముసురు వానలకు కూలిపోయే ప్రమాదం ఉందని, అలాంటి వారు ఉంటే ప్రజాప్రతినిధులు వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. వాహనదారులు రోడ్డుపై గుంతలు, చెరువులు, వాగులలో చేపలు పట్టేందుకు మత్స్యకారులు, ఉరుములు, మెరుపులు వచ్చే క్రమంలో చెట్ల కింది నిల్చొవద్దని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ శాంతిర్యాలీ



కొత్తకోట: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులు, పాస్టర్లపై దాడులు చేయడం, చర్చీలు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణ కేంద్రంలో క్రైస్తవులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక చౌరస్తాలో ప్రార్థనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి క్రైస్తవులకు, చర్చీలకు రక్షణ కల్పించాలని మత పెద్దలు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఆర్ మెనో, సైమన్, ప్రభాకర్, రీజియర్, శాస్త్రి, గోటూర్ పాల్, విజయ్, నాగభూషణం, సుందర్, కృపయ్య, ప్రియదర్శనం, భాస్కర్, జయరాజ్, నిక్సన్, రమేష్, జాన్, కృష్ణయ్య ఉన్నారు.